batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

3 అక్టోబర్ 2026
శనివారం

గద్వాల విజయలక్ష్మికి

## క్యాబినెట్ హోదానా కాదా?

గద్వాల విజయలక్ష్మికి క్యాబినెట్ హోదానా కాదా?

క్యాబినెట్ మీటింగ్‌కునో ఎంట్రీ

నియామక ఉత్తర్వుల్లో లేకపోవడమే కారణమా?




2 లో

# రెడ్ క్రాస్‌లో కిస్సా కుర్చీకా ?

నిజామాబాద్ రెడ్ క్రాస్ ఎన్నికలు ఎట్టకేలకు జరుగుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. రెండు ప్యానళ్లు హోరాహోరీగా తలపడుతున్నయి. ఈ నెల 4న రెడ్ క్రాస్ కార్యవర్గ ఎన్నిక కోసం ఎలక్షన్ జరుగనుంది. సేవా తత్పరత కోసం అత్యవసర సమయంలో అవసరమైన రక్తాన్ని సేకరించి పేషెంట్లకు, బాధితులకు అందజేసే మహత్తర సంస్థగా పేరుగడించిన రెడ్ క్రాస్ సంస్థ నేడు రాజకీయ ప్రయోజనాలకు, నీడనిచ్చే కేంద్రంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో నిజామాబాద్ రెడ్ క్రాస్ కు గొప్ప పేరుంది. ఎన్నోసార్లు అవార్డులు, రివార్డులతో పాటు గతంలోనే భవన నిర్మాణం జరిగి సేవలు విస్తరించాయి. అయితే గత కొంత కాలంగా రెడ్ క్రాస్ విస్తరణకు కొందరు మోకాళ్లడ్డారు. అక్కడ తిష్టవేసిన ఆ నలుగురు విస్తరణ సంగతి అటుంచి సేవా కార్యక్రమాల నాస్తీగా నిధుల జమను జాస్తిగా చేశారనే అపవాదును మూటగట్టుకున్నారు.రెడ్ క్రాస్ అంటేనే ప్రపంచంలోనే పేరెన్నికగల సంస్థ. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సైనికులు రక్తం కొరతతో మరణించడాన్ని చూసిన హెన్రీ డ్యూనాంట్ స్థాపించిన రెడ్ క్రాస్ ప్రపంచంలోనే పేరెన్నికకలిగిన సేవా సంస్థగా రూపుదిద్దుకుంది.

– నిజామాబాద్, బతుకమ్మ

- రెండేళ్ల తర్వాత ఎన్నికలు
- సేవా నాస్తీ . . .
- విస్తరణ జాస్తి
- థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పెత్తనం కోసమే పోరు



2 లో




రెడ్ క్రాస్ జనరిక్ మెడికల్ హాల్

## బాపూఘాట్‌లో మహాత్మా గాంధీకి సీఎం, గవర్నర్, పీసీసీ ఘన నివాళులు



2 లో

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బాపూఘాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సత్యం, అహింస, సహనం, మానవత్వం, సామాజిక బాధ్యత వంటి మహోన్నత విలువలను ఆచరించి, వాటి శక్తిని ప్రపంచానికి చాటిన మహాత్మా గాంధీ జీవితం యావత్ మానవాళికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అహింసను ఆయుధంగా, సత్యమే మార్గంగా చేసుకుని కోట్లాది భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన జాతిపిత మహాత్మా గాంధీ అని అన్నారు.

– హైదరాబాద్, బతుకమ్మ

## లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్

### అనంత్ అంబానీతో చంద్రబాబు, పవన్ భేటీ

చిత్తూర్ జిల్లా మదనపల్లెలో లక్ష కోట్లతో నిర్మించనున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ తో కలిసి శంకుస్థాపన చేశారు.

– వెబ్ డెస్క్, బతుకమ్మ



2 లో

## గాంధేయ మార్గం ఆదర్శం... అనుసరణీయం

జయంతి వేడుకల్లో మేయర్, అదనపు కలెక్టర్

2 లో





పాఠశాలల్లో విద్యార్థులకు

## బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు

### జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో చర్చలు

2 లో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయడానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్ తో ఒప్పందం చేసుకున్నాయి.

– హైదరబాద్, బతుకమ్మ

# రెడ్ క్రాస్‌లో కిస్సా కుర్చీకా?

దేశంలో రాష్ట్రపతి, రాష్ట్రంలో గవర్నర్, జిల్లాలో కలెక్టర్ల పర్యవేక్షణలో రెడ్ క్రాస్ నడుస్తుందంటే ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో చెప్పకనే చెబుతుంది. రెడ్ క్రాస్ ద్వారా కేవలం రక్తాన్ని సేకరించడమే కాకుండా తలసేమియ బాధితుల కోసం వార్డుల నిర్వాహణ, వృద్దుల కోసం ప్రత్యేక సేవా కార్యక్రమాలతో పాటు డయాలసిస్ కేంద్ర నిర్వాహణ, జనరిక్ మెడిసిన్, ప్రత్యేక అంబులెన్స్ ద్వారా సత్వర సేకరించిన రక్తాన్ని సపరేషన్ (ప్లేట్ లెట్లు)ను వేరు చేసే కార్యక్రమాలను ముందుకువచ్చింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ భవనం ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిర్మించారు. కానీ సేవా రంగమే గాడితప్పినట్లయింది.

నిజామాబాద్ జిల్లాలో ఆ నలుగురు కీలక పదవుల్లో పెత్తనం చేస్తున్నారు. ప్రధానంగా సభ్యత్వం అనేది విస్తరణ అంతగా చొరవ చూపలేదనేది వాస్తవంగా మారింది. 1996, 2001, 2011, 2016 సంవత్సరాలలో జిల్లా కలెక్టర్లే చొరవ తీసుకుని సభ్యత్వం చేయించనవే ఎక్కువ అని చెప్పాలి. నిజామాబాద్ జిల్లా జనాభా 16 లక్షలు ఉండగా రెడ్ క్రాస్ సభ్యత్వం మాత్రం 10 వేలు దాటలేదంటే అతిశయోక్తి కాదు. గత కలెక్టర్ల హయంలో 6 వేల వరకు ఉన్న సభ్యత్వాన్ని కేవలం 2800 వరకు మాత్రమే పెంచడం గమనార్హం. రెడ్ క్రాస్ అనుబంధంగా ఉండే జూనియర్ రెడ్ క్రాస్ తో పాటు ఇతర సేవా కార్యక్రమాలను పెంచిన పరిస్థితి లేదు. నిజామాబాద్ రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలోనూ రక్తం కొరత అనే మాట ప్రస్తుతం వినబడుతుంది. ప్రధానంగా ఎపిడమిక్ సమయంలో అత్యవసరమైన వైద్యం కోసం రెడ్ క్రాస్ కు వచ్చిన ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నాలుగు ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ లు ఏర్పాటయ్యాయంటే అంతా రెడ్ క్రాస్ చలవే అని చెప్పాలి. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను పెంచేందుకు నిర్వహిస్తున్న అవగాహన అంతంత మాత్రమే. ఒకప్పుడు యువజన సంఘాలు, హిరోల అసోసియేషన్లు, వివిధ యూనియన్లు, వారి వార్షికోత్సవాలు, జన్మదిన వేడుకలకు భారీగా రక్తదానం చేసేవారు. వారిని మోటివ్ చేసి రక్తదాన శిబిరాలు నిర్వహించాలంటే కూడా రెడ్ క్రాస్ అంతంత మాత్రమే అని చెప్పాలి. నిజామాబాద్ రెడ్ క్రాస్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే వారు శథవిధాలా ప్రయత్నం చేస్తున్నారు. ఏదో ఒక పదవి ఉంటే కానీ పొద్దు గడవని కొందరు రెడ్ క్రాస్ లో పాగావేసేందుకు యత్నాలు ముమ్మరం చేశారు. ఎందుకంటే రెడ్ క్రాస్ సేవా సంస్థ అయినప్పటికీ దానిని తమ స్వార్థ ప్రయోజనాల కొరకు నాయకుల వద్ద తాకట్టుపెట్టేందుకు కులాల కుంపటి, రాజకీయ రంగును పులిమేశారు. నిజామాబాద్ రెడ్ క్రాస్ సొసైటీలో గతంలో పని చేసిన వారు ఇప్పటికి లెక్కలు చెప్పలేదనే ఆరోపణలు లేకపోలేదు. గతంలో సభ్యత్వం కలిగిన ఓ రైస్ మిల్లర్ చేయించిన వందకు పైగా సభ్యత్వాలు కనిపించకుండాపోయాయట. సభ్యత్వం పెరిగితే తమకు ప్రయోజనం ఉండదని గెలుపు సాధ్యం కాదని, సభ్యత్వ నమోదు విషయాన్ని దాచిపెట్టారనే ప్రధాన ఆరోపణలున్నాయి. సేవా రంగంలో యువతకు, విద్యార్థులను భాగస్వామ్యులను చేయాల్సిన చోట కొందరి ప్రయోజనాల కొరకే సభ్యత్వం చేయకపోవడం, నిధుల సేకరణ లేదనే వాదనలున్నాయి. గొప్పగా రెడ్ క్రాస్ లో సేవల కోసం ప్రారంభమైన కొన్ని విభాగాలు అప్పుడే మూతపడడం కూడా కొందరి కృషి కారణమని చెప్పవచ్చు. కానీ ఎన్నికలు వచ్చేసరికి మళ్ళీ కుర్చీ కావాలంటూ రాజకీయ ఎత్తుగడలు వేస్తుండడం విశేషం.

# పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు



హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ని జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు ఈ రెండు సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్ కు సహకారం అందిస్తాయి. నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు తో కలిసి రూ. 5.17 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థ ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ తో కలిసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ. 4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. ఒక మంచి కార్యక్రమానికి నిధులు అందించి సహకరించడానికి ముందుకు వచ్చిన సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీ తో పాటు ఇతర ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వచ్చే డిసెంబర్ 9 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి సెంట్రలైజ్డ్ కిచెన్లను ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. నవంబర్ 30వ తేదీలోగా ఈ కిచెన్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా అవసరమైన చర్యలు



తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని, విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల కేలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని చెప్పారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని, విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్‌ను అందించే విధంగా చూడాలని, జీవితకాలం కొనసాగించాల్సిన ఈ కార్యక్రమం కాబట్టి సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు.

# గాంధేయ మార్గం ఆదర్శం...అనుసరణీయం

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : గాంధేయ మార్గం అందరికి ఆదర్శం, అనుసరణీయమని నగర మేయర్ కూరగాయల ఉమారాణి అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నిజామాబాద్ నగరంలోని గాంధీచౌక్ లో గల మహాత్ముని విగ్రహానికి మేయర్ తో పాటు అదనపు కలెక్టర్ భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఇరువురు జాతి నేతలు దేశానికి అందించిన సేవల గురించి కొనియాడారు. మహనీయులు చూపిన బాటలో పయనిస్తూ దేశాభ్యున్నతికి, సమాజ హితానికి పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ఆయా సంఘాల ప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



# గద్వాల విజయలక్ష్మీకి క్యాబినెట్ హోదానా కాదా?

హైదరాబాద్, బతుకమ్మ : గత నెలలో తెలంగాణా మంత్రి వర్గం నుండి కొండా సురేఖ ను తొలగించిన సమయంలోనే ప్లానింగ్ కమిటీ వైస్ చైర్మన్ గా ఉన్న చిన్నారెడ్డి ని కూడా తప్పించి గద్వాల విజయలక్ష్మికి అప్పగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల్లో క్యాబినెట్ హోదా తో సత్కరించారు.?సచివాలయం లో జరిగిన మంత్రివర్గ సమావేశానికి మొదటిసారి గా క్యాబినెట్ హోదాలో హాజరవ్వడానికి గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. అధికారులు ఆమెను క్యాబినెట్ భేటీ కి వెళ్లనివ్వకుండా ఆపేశారు. కారణం మీకు ఈ సమావేశంలోకి వెళ్లడానికి అర్హత, అనుమతి లేదని (ఎలా కావలసిన వారు అలా చదువుకోవచ్చు) అసహనానికి గురైన విజయలక్ష్మి వెంటనే సీఎంవోను సంప్రదించారు. అక్కడ నుండి కూడా వివరాల తో కూడిన సమాధానం రాకపోవడంతో విజయలక్ష్మి వెనుతిరిగారు. ఇంతకూ విషయం ఏమిటంటే విజయలక్ష్మికి ఇచ్చిన ఉత్తర్వుల్లో క్యాబినెట్ ర్యాంక్ అని పొందుపర్చకపోవడమే. కాని క్యాబినెట్ సమావేశాలకు కూడా ఆహ్వానితులే అనే అంశం చేర్చలేదు. ప్రభుత్వం అనేక అవసరాల దృష్ట్యా క్యాబినెట్ ర్యాంక్ చాలా మందికి ఇస్తూ ఉంటుంది కానీ వారందరికీ క్యాబినెట్ భేటీకి అనుమతి ఉండదు. విజయలక్ష్మికి ముందు ఆ హోదాలో ఉన్న చిన్నారెడ్డి క్యాబినెట్ భేటీకి హాజరు అయ్యేవాడు. ఆయనకు ఇచ్చిన జీవోలోనే క్యాబినెట్ భేటీకి అనుమతి ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా పని చేసిన ఎస్.నిరంజన్ రెడ్డి, బి. వినోద్ కుమార్‌లకు మంత్రివర్గ సమావేశాలకు హాజరయ్యేలా అప్పట్లో ఉత్తర్వుల్లోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో వారు నిరభ్యంతరంగా భేటీల్లో పాల్గొనేవారు. గద్వాల విజయలక్ష్మి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షురాలిగా నియమితులైన తర్వాత జరిగిన తొలి క్యాబినెట్ భేటీకి ఆమెకు నో ఎంట్రీ అనడం చర్చనీయాంశంగా మారింది.

## బాపూఘాట్‌లో మహాత్మా గాంధీకి సీఎం, గవర్నర్, పీసీసీ ఘన నివాళులు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు.



## లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్



హార్టికల్చర్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత్ అంబానీతో చంద్రబాబు, పవన్ భేటీ అయ్యారు.

# కామారెడ్డిలో కిసాన్ షాపింగ్ మాల్ ప్రారంభించిన మహమ్మద్ అలీ షబ్బీర్



కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి పట్టణంలో కిసాన్ షాపింగ్ మాల్ ను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణతో కలిసి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ కామారెడ్డి పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కొత్తగా వాణిజ్య సంస్థలు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు కావడం శుభపరిణామమని అన్నారు. స్థానిక ప్రజలకు నాణ్యమైన వస్తువులు, మెరుగైన సేవలు అందుబాటులోకి రావడంతో పాటు పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు ఇలాంటి సంస్థలు దోహదపడతాయని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో వ్యాపార, వాణిజ్య రంగం అభివృద్ధి చెందడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక వ్యాపారులకు కూడా కొత్త అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. కిసాన్ షాపింగ్ మాల్ యాజమాన్యానికి, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణకు అభినందనలు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మౌలిక వసతుల కల్పనతో పాటు వ్యాపార, వాణిజ్య రంగం అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ఏర్పడేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి, మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, కామారెడ్డి పిఎసిఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు గంప ప్రసాద్ , ఇప్ప శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజా గౌడ్ తదితరులున్నారు.

# మహాత్మా గాంధీ, శాస్త్రి విగ్రహాలకు నివాళ్ళర్పించిన మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల గాంధీ చౌకలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ప్రధాని, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా తిలక్ గార్డెన్ చౌరస్తాలోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సహనం, సేవా మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఆయన నాయకత్వం భారత చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశం కోసం లాల్ బహదూర్ శాస్త్రి చేసిన సేవలు, ఆయన చూపిన నిజాయితీ, నిరాడంబరత, దేశభక్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. దేశ ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తూ, దేశ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. జై జవాన్.. జై కిసాన్ అనే నినాదంతో దేశ రక్షణలో సైనికుల పాత్రను, దేశ ఆహార భద్రతలో రైతుల ప్రాధాన్యతను శాస్త్రి చాటి చెప్పారని గణేష్ బిగాల అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్, జగత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# జగిత్యాలలో భారీ ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం వెలుగులోకి..

జగిత్యాల, బతుకమ్మ : అధిక లాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడులు సేకరించిన కేసులో ఓ వ్యక్తిని జగిత్యాల పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. అస్పెక్ట్ ట్రేడర్స్ యాప్ పేరుతో దాదాపు రూ.5 కోట్ల పెట్టుబడులు సేకరించి మోసం చేసినట్లు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నరసింగపూర్ రోడ్‌కు చెందిన బెజ్జంకి అనిల్ కుమార్ పట్టణ పోలీసులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చల్గల్ గ్రామానికి చెందిన మానాల మారుతి అనే వ్యక్తి అస్పెక్ట్ ట్రేడర్స్ అనే యాప్‌లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కంపెనీ గోల్డ్‌పై ట్రేడింగ్ చేస్తుందని, పెట్టుబడిపై ప్రతిరోజూ ఒక శాతం లాభం ఇస్తామని, 100 రోజుల్లో పెట్టుబడి మొత్తం తిరిగి వస్తుందని, ఆ తర్వాత మరో 100 రోజుల్లో పెట్టుబడి రెట్టింపు అవుతుందని నమ్మించినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా తమ కింద కొత్త ఇన్వెస్టర్లను చేర్పిస్తే వారికి, రిఫరల్ ఐడీ ఇచ్చిన వారికి కూడా లాభాలు వస్తాయని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో తెనాలికి చెందిన కన్నెగంటి జనార్దన్, గుంటూరుకు చెందిన మోహన్, నాగ్‌పూర్‌కు చెందిన ఇర్ఫాన్ తదితరుల సహకారంతో యాప్‌ను రూపొందించి పలువురి నుంచి దాదాపు రూ.5 కోట్ల మేర పెట్టుబడులు సేకరించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు మానాల మారుతిని చల్గల్‌లోని అతని ఇంటి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి అస్పెక్ట్ ట్రేడర్స్ వెల్ కమ్ అస్పెక్ట్రా పేరుతో ఉన్న పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నా రు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో




అధిక లాభాల పేరుతో పెట్టుబడులు పెట్టే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని, అనుమానాస్పద పెట్టుబడి పథకాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

ఇందూర్, బతుకమ్మ : సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా ఇందూర్ అర్బన్ నియోజకవర్గంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని ఎన్జీవో కాలనీ చౌరస్తాలోని రైతుబజార్ వద్ద స్వచ్ఛ భారత్ నిర్వహించి రోడ్లను ఊడ్చారు. ఈ సందర్భంగా బల్దియాలో పని చేస్తున్న సానిటరి జవాన్లతో పాటు పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. నిజామాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పోతుల పురుషోత్తం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి శివప్రసాద్, బీజేపీ అధికార ప్రతినిధి, కార్పొరేటర్ గోపిడి స్రవంతిరెడ్డి, ఫ్లోర్ లీడర్ దుంపల జ్యోతి, బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.






# గిరిరాజ్ కళాశాలలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామ్మోహన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవితం, ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.రంగరత్నం మాట్లాడుతూ గాంధీ బోధించిన సత్యం, అహింస, నైతిక విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. చరిత్ర విభాగం అధ్యాపకులు రమేష్ గౌడ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చేసిన సేవలు, ఆయన అనుసరించిన అహింసా పోరాట మార్గం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎన్సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఎం. రామస్వామి మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ జీవితం, ఆయన పోరాట పటిమ, సత్యం, అహింసా సిద్ధాంతాలు, విలువలు ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయమని విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వినయ్ కుమార్, వెంకట రమణ, నరేష్ కుమార్, దస్తప్ప, రంజిత్, రాము, సుధాకర్, రాజశేఖర్, కార్యాలయ సిబ్బంది మాజిద్ అలీ, గఫార్, వాసు, గంగాధర్, విద్యార్థులు, ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



## బాన్సువాడలో గాంధీ విగ్రహానికి
# నివాళ్ళర్పించిన పోచారం



బాన్సువాడ, బతుకమ్మ : మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా బాన్సువాడ పట్టణ కేంద్రంలోని గాంధీ చౌక్‌లో మహాత్మ గాంధీ విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి, సహనం అనే విలువలను ప్రపంచానికి చాటి చెప్పిన మహాత్మ గాంధీ మహనీయుడని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ చూపిన అహింసా మార్గం, ప్రజలను ఏకం చేసిన నాయకత్వం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన, సమానత్వం కలిగిన, సామాజిక న్యాయంతో కూడిన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆలోచనలు, ఆదర్శాలు నేటి సమాజానికి మాత్రమే కాకుండా భావితరాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ కాసుల విజయ, బాన్సువాడ పట్టణ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొని మహాత్మ గాంధీకి నివాళులర్పించారు.

# నేటి యువత మహనీయుల మార్గదర్శకంలో నడవాలి

### బీసీటీయూ జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా బిసి ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వారి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చూపిన మార్గంలో నేటి యువత నడుచుకుని వారి భవిష్యత్తు ను తీర్చిదిద్దుకోవాలన్నారు. దేశ అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందాలంటే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులు కొట్టాల రామకృష్ణ, అసోసియేటడ్ అధ్యక్షులు మోహన్, గౌరవ సలహాదారులు రమణ స్వామి, సత్యనారాయణ, మాక్లూర్ మండల బిసిటియు అధ్యక్షులు గంగోనె సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# జోన్ల వారీగా చెత్తబండ్ల పంపిణీ



ఇందూర్, బతుకమ్మ : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా చెత్తను సేకరించి తరలించడానికి ఉపయోగపడే చేతిబండ్లను డివిజన్ల వారీగా పంపిణీ చేశారు. గాంధీజయంతిని పురస్కరించుకుని నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూతనంగా కొనుగోలు చేసిన చెత్తబండ్లను జోన్ల వారీగా ఆయా కార్పొరేటర్లకు, పబ్లిక్ హెల్త్ వర్కర్లకు డివిజన్ల వారీగా పంపిణీ చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ మేయర్ ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కమర్ అహ్మద్ లు పాల్గొని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెన్షన్ సాధించే వరకు పోరాటం

## ఐసీఈయూ నేత డీఎస్ రఘు




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఎల్ఐసి 1996 బ్యాచ్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం సాధించే వరకు ఐసీఈయూ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఐసీఈయూ సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి డీఎస్ రఘు స్పష్టం చేశారు. ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ బ్రాంచీల సంయుక్త సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. బ్యాచ్ ఉద్యోగులకు పెన్షన్ సాధించేందుకు యూనియన్ తన వంతు కృషిని కొనసాగిస్తుందని, ఈ అంశంలో ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పెన్షన్ అంశాన్ని కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ యూనియన్‌లో అంతర్గత విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. ఉద్యోగులు ఇలాంటి కుట్రపూరిత ప్రచారాలను నమ్మకుండా వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. ఐక్యతే యూనియన్‌కు ప్రధాన బలమని??సభ్యులందరూ సమానమేనని ఆయన పేర్కొన్నారు. కులాలు, మతాల పేరుతో ఎల్ఐసి ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని డీఎస్ రఘు పిలుపునిచ్చా రు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఐసీఈయూ ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహించిందని, ఆ పోరాటాలు, విలువలు, త్యాగాల పునాదులపైనే యూనియన్ నిర్మితమైందని ఆయన తెలిపారు. గొప్ప చరిత్ర, పోరాట వారసత్వం కలిగిన యూనియన్‌పై ఎవరైనా నిందలు వేస్తే సభ్యులు వాస్తవాలను ప్రజలకు తెలియజేసి వాటిని తిప్పికొట్టాలని ఆయన సూచించారు. యూనియన్‌ను బలహీనపరిచే ప్రయత్నాలకు ఉద్యోగులు దూరంగా ఉండాలని, పరస్పర సహకారం, ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ముఖ్యంగా 1996 బ్యాచ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యను పరిష్కరించే దిశగా పోరాటాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షులు గుణశేఖర్ శివరాం మాట్లాడుతూ ఉద్యోగుల పెన్షన్ విషయమై అన్ని అవకాశాలు స్వీకరించి 1996 బ్యాచ్ ఎల్ఐసి ఉద్యోగులకు పెన్షన్ ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పెన్షన్స్ స్కీమ్ ను ఉపయోగించుకొని ఉద్యోగులను మభ్య పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు సాధించబడుతాయని అన్నారు. ఈ సందర్భంగా బ్రాంచీలకు చెందిన ఉద్యోగులు వివిధ ఉద్యోగ సంబంధిత సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై చర్చించి, పరిష్కారానికి యూనియన్ తరఫున కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఐసిఈయు సంయుక్త కార్యదర్శి లు బాలస్వామి రాజేష్ శ్రావణ్, జావీద్ తో పాటు ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ బ్రాంచీలకు చెందిన ఐసీఈయూ అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ దివస్ నిర్వహణ







## కాచిగూడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ శ్రమదానం

హైదరబాద్, బతుకమ్మ:దక్షిణ మధ్య రైల్వే 17 సెప్టెంబర్ నుంచి 2 అక్టోబర్ 2026 వరకు స్వచ్ఛతా హి సేవకార్యక్రమాన్ని1అక్టోబర్ నుంచి 15 అక్టోబర్ 2026 వరకు స్వచ్ఛ భారత్ పఖ్వాడాను,అలాగే 2 అక్టోబర్ నుంచి 31 అక్టోబర్ 2026వరకు ప్రత్యేక ప్రచారం 6.0 ను నిర్వహిస్తోంది. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛతా మే సహభాగ్,స్వచ్ఛ భారత్,వికసిత్ భారత్,అనే నినాదంతో స్వచ్ఛతా హి సేవ,కార్యక్రమాన్ని 17 సెప్టెంబర్ 2026 న ప్రారంభించారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం 2 అక్టోబర్ 2026న ముగిసింది. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కాచిగూడ రైల్వే స్టేషన్‌లో అధికారులు,సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్న వారికి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్,హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ స్టేషన్‌లోని సపాయి మిత్రలను సన్మానించారు. అలాగే,పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించిన వ్యాసరచన,చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రజల్లో పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు రైల్వే ఉద్యోగులు స్టేషన్‌లో పరిశుభ్రత అంశంపై నుక్కడ్ నాటక్ ను ప్రదర్శించారు. అదేవిధంగా,సాంస్కృతిక కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. పరిశుభ్రతను ప్రోత్సహించడం,ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో భాగంగా జనరల్ మేనేజర్ కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు పర్యావరణహితమైన జూట్ బ్యాగులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూస్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ రోజు స్వచ్ఛ భారత్ దివస్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత అనేది ఒక్కరోజుకే పరిమితమైన కార్యక్రమం కాదని,ఏడాది పొడవునా ప్రతిరోజూ పాటించాల్సిన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. రైళ్లు,రైల్వే స్టేషన్లు,వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో అధికారులు,సిబ్బంది చురుకుగా పాల్గొనడంతో పాటు,తమ కుటుంబ సభ్యులు,పొరుగువారిని కూడా స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగస్వాములు కావడానికి ప్రోత్సహించాలని జనరల్ మేనేజర్ సూచించారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హైదరాబాద్ డివిజన్ అధికారులను,సిబ్బందిని జనరల్ మేనేజర్ అభినందించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి

## టీయూడబ్ల్యూజే ఐజేయూ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి



కామారెడ్డి, బతుకమ్మ : జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకై దశాబ్దాలుగా పోరాటం సాగుతోందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) జిల్లా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రజనీకాంత్, రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే–ఐజేయూ పిలుపు మేరకు దేశవ్యాప్త డిమాండ్ల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీగంజ్‌లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే నాయకులు మాట్లాడుతూ మీడియా రంగంలో పనిచేస్తున్న విలేకరుల రక్షణకు ప్రత్యేక చట్టాలు లేకపోవడం విచారకరమన్నారు. భారత రాష్ట్రపతితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. 1982 తర్వాత వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాను పొందుపరిచి నూతన మీడియా కమిషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై శారీరకంగా దాడులు, బెదిరింపులు, అక్రమ కేసులు ఘటనలు జరుగుతున్న తరుణంలో జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక జాతీయ రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. గతంలో రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ద్రవ్యోలభాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులకు నూతన వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఉచిత, నాణ్యమైన వైద్యం కోసం జర్నలిస్టులందరికీ క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు?అందజేయాలన్నారు. మీడియా స్వేచ్ఛను పరిరక్షించడంలో, జర్నలిస్టుల ఐక్యతను చాటడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి వెంకటేష్, ఉపాధ్యక్షులు అబిద్, శంకర్, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదు

## టియు డబ్ల్యూ జె జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ: దేశవ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయులు మీడియా పరిశ్రమకు సంబంధించిన కీలకమైన,దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని టి యు డబ్ల్యూ జె జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్ మాట్లాడుతూ... ఐ జె యు పిలుపు మేరకు దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా నిరసన తెలుపుతున్నామని అన్నారు. ముఖ్యంగా దేశ స్థాయిలో సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. రెండవ పత్రికా కమిషన్‌ను 1978లో నియమించగా,అది 1982లో తన నివేదికను సమర్పించింది. గత నాలుగు దశాబ్దాలుగా,24/7 ప్రసార నెట్‌వర్క్‌లు,డిజిటల్ వార్తా వేదికలు,ప్రజా చర్చలను తీవ్రంగా ప్రభావితం చేసే సోషల్ మీడియా వ్యవస్థల ఆవిర్భావంతో భారత మీడియా రంగం అపూర్వమైన పరివర్తనకు లోనైంది.

పాత్రికేయులు,మీడియా సంస్థల భద్రత కోసం ఒక ప్రత్యేక కేంద్ర చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. పని చేసే పాత్రికేయుల కోసం చట్టబద్ధమైన రక్షణల పునరుద్ధరణ,పరిరక్షణ చట్టం చేయాలి. మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేతన మండలి ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ళు,ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించాలని, ఉద్యో గులకు ఇచ్చిన విధంగా జర్నలి స్టులకు హెల్త్ కార్డులు ఇచ్చి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందించాలని, జర్నలిస్టులపై నిత్యం జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తగిన చట్టం తీసుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి అరవింద్ బాలాజీ,కోశాధికారి సిరిగాద ప్రసాద్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొబ్బిలి నర్సయ్య,జాతీయ కౌన్సిల్ సభ్యులు గంగాదాస్,సోషల్ మీడియా సభ్యులు దేవీదాస్,జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరాజ్, సాయిరాం,మురళి,ఆర్మూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గంగామోహన్,డిచ్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మురళి,బోధన్ డివిజన్ ఇంచార్జీ గంగులు,తదితరులు పాల్గొన్నారు.

# గాంధి... లాల్ బహదూర్ శాస్త్రీ లను స్మరించుకున్న కాంగ్రెస్ శ్రేణులు

## డిసీసీ అధ్వర్యంలో గాంధి , శాస్త్రీ జయంతి వేడుకలు





నిజామాబాద్ సిటి, బతుకమ్మ:జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి , లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్ నందు వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం తిలక్ గార్డెన్ వద్ద గల లాల్ బహుదూర్ శాస్త్రి విగ్రహానికి,గాంధీ చౌక్ వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి, నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ లు మాట్లాడుతూ బ్రిటిష్ వారు భారతదేశాన్ని సుమారు 200 సంవత్సరాలు పరిపాలించారని ,వారి పరిపాలనలో భారతదేశ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని దేశానికి స్వాతంత్రం అవసరమని మహాత్మా గాంధీ గారు శాంతి మార్గంలో దేశ ప్రజలను ఐక్యమత్యం చేసి స్వాతంత్ర ఉద్యమం వైపు ముందుకు నడిపారని,దేశానికి స్వాతంత్రం రావడంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంతో కీలకమైంది అని అన్నారు. రెండో ప్రధానిగా లాల్ బహదూర్ శాస్త్రి దేశాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళుతూ జై జవాన్ జై కిసాన్ నినాదాన్ని అందించడం జరిగిందని,అదేవిధంగా ఇందిరాగాంధీ గరీబీ హఠాత్ నిదానంతో పేదవారికి కూడు గుడ్డ ఇల్లు అందించాలని లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అదే లక్ష్యంతో ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నారని,దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు కేవలం 20 ఇండ్లకే ఉన్న కరెంటును కాంగ్రెస్ పార్టీ దేశంలో ప్రతి ఇంటికి కరెంటును అందించిందని,అందులో భాగంగా రేవంత్ రెడ్డి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని,నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి సన్న బియ్యం అందిస్తున్నారని,మహిళల కొరకు ఉచిత బస్సు సౌకర్యం అందిస్తున్నామ ని,పేదవారి ఆరోగ్యం కొరకు పది లక్షల వరకు ఆరోగ్యశ్రీ అందిస్తున్నామని,జై కిసాన్ నినాదం లో భాగంగా రైతుల కొరకు రుణమాఫీ చేయడం జరిగిందని సన్నవడ్లకు భువన అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి నాయకులు గాంధీ గారి కీర్తిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని గాంధీ దేశానికి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహేష్ కుమార్ గౌడ్ సారధ్యంలో రాష్ట్ర అభివృద్ధిలో ముందుకు వెళుతుంది అని,రాబోయే రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ గారిని చేస్తామని,దేశాన్ని గాంధీ కలలుగన్న విధంగా అభివృద్ధి చేస్తూ ముందుకు వెళతామని మరొకసారి మహాత్మా గాంధీ కి లాల్ బహదూర్ శాస్త్రి కి జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హాందాన్,రాష్ట్ర కల్లుగీత కార్మిక చైర్మన్ శేఖర్ గౌడ్,మేయర్ ఉమారాణి,పిసిసి జెనరల్ సెక్రటరీ రామ్ భూపాల్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత్ ,నూడ చైర్మన్ కేశ వేణు,ఎఐసిసి పరిశీలకులు కాపుకర్ గన్ రాజ్,డిసిసి కోశాధికారి భక్తవస్తలం,ఉపాధ్య క్షులు కౌడపు శరత్ కుమార్,గాదరి గోపి,జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్, ఎస్టీ సెల్అధ్యక్షులు యాదగిరి,ఉపాధ్యక్షులు గోపి,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్,మహిళ అధ్యక్షు రాలు రేవతి,కార్పొరేటర్లు గంగాధర్,మనో హర్,ప్రవీణ్ యాదవ్,అదేవిధంగా బంటు బలరాం, వహీద్,లవంగ ప్రమోద్,ఉష,చంద్రకళ, మల్లైకా,సుజాత,అపర్ణ,స్వప్న,అదే ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగ సంఘాల నాయకులు



హైదరాబాద్, బతుకమ్మ : రెండు డీఏ?విడుదల కోసం కేబినెట్ ఆమోదం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్, టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హుస్సేనికి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ లోని కేంద్ర టీఎన్జీవో కార్యాలయం వద్ద ఎంప్లాయిస్ జేఏసీ, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి శేఖర్ నేతికుంటలు మాట్లాడుతూ ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన పెండింగ్ డీఏల విడుదల కోసం గురువారం క్యాబినెట్ లో రాష్ట్ర ప్రభుత్వం రెండు డీఏలను విడుదల చేస్తూ తీర్మానం చేసేందుకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్,రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి, సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున టీఎన్జీవో నిజామాబాద్ జిల్లా పక్షాన ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. మిగతా పెండింగ్ సమస్యల పరిష్కారం కొరకు,?ప్రధానంగా పీఆర్సీ రిపోర్టును తెప్పించుకొని 51% ఫిట్మెంట్ తో నూతన పేస్కే ల్ అమలు చేయాలని, మిగిలిన పెండింగ్ డీఏల విడుదల చేయాలని, పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగ, పెన్షనర్లకు స్వాంతన చేకూర్చే విధంగా బిల్లులు అన్ని మంజూరు చేయాలని, సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు కోసం చర్యలు తీసుకోవాలని, హెల్త్ కార్డుల అమలులో తలెత్తుతున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, అలాగే ప్రభుత్వం మీద ఎలాంటి ఆర్థిక భారం పడని, ఆర్థికేతర సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించుటకు కృషి చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఉద్యోగ సంఘాల జేఏసీకి ఇచ్చిన హామీ మేరకు రెండు డీఏలను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి టిఎన్జీవో నిజామాబాద్ జిల్లా పక్షాన మరొకసారి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

# చోరి కేసులో బయట పడటానికి అప్పులు..







### అప్పులుతీర్చేందుకు మళ్లీ చోరి. . . భారీ దొంగతనం కేసును సాంకేతిక ఆధారాలతోఛేదించిన బాన్సువాడ పోలీసులు. . . గౌలిగూడ కాలనీలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్. . . 31.2 తులాల బంగారం, 3 కిలోల వెండి, 9,700 నగదు స్వాధీనం

కామారెడ్డి, బతుకమ్మ: బాన్సువాడ పట్టణంలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీరాజేష్ చంద్ర శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొగ్గుగుడిసె చౌరస్తా బాన్సువాడ కు చెందిన పాత నేరస్థులు దండుగుల మైసయ్య, దండుగుల ఎల్లయ్యలను పోలిసులు అదుపులోకితీసుకున్నారు. వారిని పోలీస్ స్టైల్ లో విచారించడంతో బాన్సువాడ పట్టణంలో గౌలిగూడ లోకిరాణా వ్యాపారి చింతల భాస్కర్ నివాసంలోజరిగిన చోరీ కేసు కొలిక్కి వచ్చింది. చింతల భాస్కర్ తన ఇంటికి తాళం వేసి కిరణాదుకాణం వెళ్లగా, ఇంటి పక్కన ఉండే మైసయ్య, ఎల్లయ్యలనుతాళాలను పగులగొట్టి 31.2 తులాల బంగారం, 2.3కిలోల వేండి, రూ.9,700 నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు విచారణబాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి పర్యవేక్షణలో బాన్సువాడ టౌన్ ఎస్ హెచ్ ఓ శ్రీధర్,సీసీఎస్ సీఐ సంతోష్ కుమార్, బాన్సువాడ పిఎస్ ఎస్ఐ శిరీష ఆధ్వర్యంలో విచారణప్రారంభించారు. మూడు టీంలతో అన్ని సీసీ కెమోరాలు పరిశీలించారు. సాంకేతికంగాదొరికి అనావాళ్లు ఆదారాలతో పరిశీలించగా పాత నేరస్తులు చోరీ చేసినట్లు అంచనాకు వచ్చివారి కోసం గాలించారు. బోగ్గు గుడిసె వద్ద అనుమానాస్పదంగా దారికి న దండుగుల మైసయ్య,ఎల్లయ్య లు గౌలిగూడ చోరీకి పాల్పడిందితామేనని అంగీకరించారు. దండుగుల మైసయ్య గతంలో ఆరు చోరీలకు పాల్పడిన కేసులోనిందితుడిగా ఉన్నారు. మైసయ్య చోరి కేసులో అరెస్టు కాబడి బెయిల్ కోసం జరిగిన ఖర్చులు,అప్పులు తీర్చాలంటే చోరి ఒక్కటే మార్గమని దొంగతనం చేసినట్లు తెలిపారు. వారి వద్దనుంచి 31.2 తులాల బంగారం, 2.3 కిలోల వెండి, రూ.9,700 నగధు తో పాటు ఒక మోటార్సైకిల్, రెండు మోబైల్ పోన్ లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసీబిచ్కుంద కోర్టులో హాజరు పరుచగా వారిని న్యాయస్థానం రిమాండ్ కు పంపినట్లు ఎస్పీతెలిపారు. చోరి జరిగిన పక్షం రోజుల్లోనే కేసును చేదించిన బాన్సువాడ డిఎస్పీ విఠల్రెడ్డి పర్యవేక్షణలో బాన్సువాడ టౌన్ ఎస్ హెచ్ ఓ శ్రీధర్, సీసీఎస్ సీఐ సంతోష్కుమార్, బాన్సువాడ పిఎస్ ఎస్ఐ శిరిషాల, క్రైమ్ పార్టీ సిబ్బంది, బాన్సువాడ పోలీస్సిబ్బందిని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అభినంధించారు.

# రోగులకు వైద్యాసేవలు నిరంతరం అందుబాటులో ఉండాలి

## డీఎం అండ్ హెచ్ ఓ.డా. రాజశ్రీ





భీమ్ గల్, బతుకమ్మ: ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవల ను నిరంతరం అందుబాటులో ఉంచాలని డీఎం అండ్ హెచ్ ఓ సిబ్బందికి సూచించారు. భీమ్ గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు అవసరమైన పరీక్షలు, చికిత్స, ఆరోగ్య సలహాలు సకాలంలో అందించాలని సిబ్బందిని ఆదేశించారు.సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రసవాల సమయంలో గర్భిణీలకు అవసరమైన వైద్య సంరక్షణ అందిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే తగిన వైద్య సేవలు అందేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీలో భాగంగా ముఖ్యంగా గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలు, ఏ ఎన్ సీ పరీక్షలు, ప్రసవ సేవలు, గర్భిణీల ఆరోగ్య పరిస్థితిపై వివరా లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, రోగు లకు అందుతున్న సేవల నాణ్యతపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎం అండ్ హెచ్ఓ సూచించారు. రోగులకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అం దుబాటులో ఉండేలా స్టాక్ను పర్యవేక్షించాలని సూచించారు.తనిఖీలో భాగంగా అవుట్ పేషంట్ రిజిస్టర్, 24 గంటల డ్యూటీ రోస్టర్ తదితర రికార్డులను ఆమె పరిశీలించారు. నర్సింగ్ ఆఫీసర్ విమలను ఆసు పత్రిలో జరు గుతున్న ప్రసవాల సంఖ్య, ప్రసవ సేవలకు సంబంధించిన వివరా లను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ ఆఫీసర్ అఖిలను ఆసుపత్రిలో అందుబా టులో ఉన్న మందుల నిల్వలు, మందుల వినియోగం, అవసరమైన మందుల లభ్యత తదితర అంశాలపై వివరా లు అడిగి తెలుసుకున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో డా. తేజశ్విని, కృపాకర్ హెచ్ ఈ ఓ, సాయి సబ్ యూనిట్ ఆఫీసర్, మనోజ్ డీఎం అండ్ హెచ్ ఓ వెంట ఉన్నారు.

# రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో డిఈవోకు సన్మానం

ఇందూర్, బతుకమ్మ : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ని జిల్లా అధ్యక్షులు జమీలుల్లా, ప్రధాన కార్యదర్శి రమణాచారిలు సన్మానించారు. గురువారం డిఈవోను మర్యాదపూర్వకంగా కలిసి 724 ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రెగ్యులరైజేషన్ చేసినందుకు సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. అలాగే జిల్లాలోని ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ, ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలపై దృష్టి కేంద్రీకరించి వర్క్ అడ్జెస్ట్ మెంట్ కింద సర్దుబాటు చేయాలని సంఘం తరుపున కోరారు.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శ్రీమన్నారాయణ చారి, పెంటా శ్రీనివాస్ తదితరులున్నారు.



## తాళ్ల రాంపూర్ వీడీసీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### మోపాల్, నిజామాబాద్ రూరల్ మండల గౌడ సంఘాల డిమాండ్



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ ఆటవిక చర్యలకు పాల్పడుతున్న తాళ్లరాంపూర్ వీడీసీపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని మోపాల్, నిజామాబాద్ రూరల్ మండల గౌడ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ముదక్ పల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో గౌడ కులస్తులపైన, గీత కార్మికుల పైన వీడిసి లా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, గౌడ కులస్తులు ప్రభుత్వం వారికి కేటాయించిన లైసెన్సుల ద్వారా గీత వృత్తి చేస్తూ జీవనం కొనసాగిస్తుంటే వారిపైన దాడులు చేస్తూ భయాందోళన గురిచేస్తూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడం, ఇవ్వకపోతే సాంఘిక బహిష్కరణ చేయడం చట్ట విరుద్ధమని వారు మండిపడ్డారు. రాజ్యాంగం ద్వారా ఏర్పడ్డ ప్రభుత్వాలు, న్యాయ వ్యవస్థ, చట్టాలు, ప్రజా ప్రతినిధులు ఉన్నప్పటికీ వాటిని బేఖాతారు చేస్తూ సమాంతరంగా గ్రామాల్లో గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో సమాంతర ప్రభుత్వాలు నడుపుతున్నఈ వీడీసీలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైలుకు పంపాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల నుంచి వేలాది మంది గౌడ సోదరులను ఏకం చేసి "చలో రాంపూర్" కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోపాల్, నిజామాబాద్ రూరల్ మండల గౌడ నాయకులు వేణుగౌడ్, సాయిగౌడ్, దశగౌడ్, దత్తగౌడ్, రాజుగౌడ్, అశోక్ గౌడ్, బాలరాజు గౌడ్, ఈశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలని రాణాఖుర్దు గ్రామపంచాయతీ తీర్మాణం



మోపాల్, బతుకమ్మ : మూతపడిన ఎన్సీఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి దాని బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నడిపించాలని రాణాఖుర్దు గ్రామ సర్పంచ్ కుచన్ పల్లి జలంధర్ రెడ్డి డిమాండ్ చేశారు.గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం రాణాఖుర్దు గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ జలంధర్ రెడ్డి, ఉప సర్పంచ్ కంజర కిరణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు చెరుకు ఉత్పత్తిదారుల విజ్ఞప్తి మేరకు గ్రామంలో రైతులు చెరుకు పండించేందుకు ముందుకు వస్తున్న సందర్భంలో ముందుగా మూతపడిన ఎన్సీఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వం తెరిపించాలని సభ్యులు డిమాండ్ మేరకు తీర్మానాన్ని ఆమోదించడమైనదని ఉప సర్పంచ్ కిరణ్ తెలిపారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మృధుల, సభ్యులు తిరుపతి పూజ, సుప్రియ, రవి, కారోబార్ గాజుల అరుణ్ లతో పాటు మాజీ సర్పంచ్ వేల్పూర్ భూమయ్య, అంచ మల్కా రెడ్డి, సాగరిక, రాణి, గంగామణి, పెరిక లింగం తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో రక్తదానం చేసిన ఆర్మీ ఉద్యోగి



ఇందూర్, బతుకమ్మ : ఎమర్జెన్సీ పేషెంట్ కు ఓ పాజిటివ్ రక్తం అత్యవసరంగా అవసరం ఉండగా వివేకానంద యూత్ ను సంప్రదించడంతో సురేష్ (ఆర్మీ) వెంటనే స్పందించి రక్తదానం చేశారు. రక్తదానం చేయడం, ఇప్పటివరకు రెడ్ క్రాస్ సొసైటీలో మన వివేకానంద యూత్ సభ్యులు?372 మంది మన యూత్ సోదరులు ఐక్యమత్యంతో రక్తదానం చేయడం జరిగిందని యూత్ అధ్యక్షులు రూపేష్ రెడ్డి అన్నారు. వివేకానంద యూత్ గత 16 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమాలు, స్కూల్ పిల్లలకు బ్యాగుల పంపిణీ, ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ, ఎవరైనా కష్టంలో ఉంటే అందరికీ తోచినంత ఆర్థిక సాయం, చలికాలంలో దుప్పట్లు రగులు పంపిణీ, ఎండాకాలంలో బట్టర్ మిల్ పంపిణీ సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన వివేకానంద యూత్ సోదరులు వినయ్, రామన్ పాల్గొన్నారు.

# పంటలు ఎండిపోతున్న పట్టించుకోని ప్రభుత్వం

### రైతుల పంట పొలాలను పరిశీలించిన టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు

నవీపేట్, బతుకమ్మ : పంటలు ఎండిపోతున్న రాష్ట్ర ప్రభుత్వం రైతుల బాధలు పట్టించుకోవడం లేదని టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం నిజాంపూర్ గోదావరి ఒడ్డున్న ఎండిపోయిన పంట పొలాలను టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలేటి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. గోదావరి ఒడ్డున ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 1600 ఎకరాల పంట భూమికి నీరు అందించడం జరుగుతుందని, కానీ 20 రోజుల కింద ఈ లిఫ్ట్ రెండు మోటార్లు పూర్తిగా చెడిపోవడంతో ఈ మోటార్లను ఇప్పటివరకు రిపేర్ చేయించే నాథుడే కరువయ్యాడన్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, దాదాపు ఈ లిఫ్ట్ కింద నీరు అందక పోవడంతో సుమారు 80 ఎకరాల పంట పూర్తిగా ఎండిపోవడం జరిగిందన్నారు. రైతు ఎకరానికి 30,000 ఖర్చు పెట్టి ఈ స్థాయి వరకు వరి పంటను తీసుకొస్తే గోదావరి నదిలో నీరు ఉండి కూడా మోటార్లను బాగు చేయించలేక తమ వరి పంటను ఎండగొట్టారని చెప్పేసి లింగాపూర్ గ్రామానికి చెందిన రైతు గణేష్ గురువారం బాధతో కన్నీరుమున్నీరవుతు తన వరి పంటకు నిప్పుపెట్టారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రక్షణ సేన నాయకురాలు కల్వకుంట్ల కవిత వెంటనే స్పందించి రైతుకు మనోధైర్యాన్నిఇవ్వాలని, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు అండగా ఉండాలని సూచించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ చేతికి వచ్చిన పంట కు నీరు ఇవ్వలేని పరిస్థితి ఈ రాష్ట ప్రభుత్వానికి ఉందని, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పక్కగ్రామంలోనే ఇలా పంటలు ఎండిపోవడం సిగ్గు చేటన్నారు. వెంటనే మోటార్లని రిపేర్ చేయించి రైతులను ఆదుకోవాలని, నష్టపోయిన పంటకు వెంటనే నష్ట పరిహారం అందించాలని లేని యెడల



నష్టపోయిన రైతులతో ఎమ్మెల్యే ఇంటిని, జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి దొంత ప్రవీణ్, సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు, టౌన్ ప్రెసిడెంట్ యెండలి ప్రసాద్, జిల్లా నాయకులు కరిపే గంగాధర్, షాన్వాజ్ జనార్ధన్, దినేష్, సంతోష్, రాఘవేందర్, ధర్మన్న తదితరులున్నారు.

### సర్ ప్రక్రియలో అక్రమాలను నిరసిస్తూ

# తెలంగాణ జన సమితి మౌన దీక్ష

### ఎన్నికల కమిషన్ పారదర్శకంగా వ్యవహరించాలి ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్, బతుకమ్మ : సర్ ప్రక్రియను నిలిపివేయాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మౌన దీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దీక్షను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదండరాం



మాట్లాడుతూ కంచే చేను చేసినట్టుగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని, అధికారంలో ఉన్నవారు చెప్పినట్టు వ్యవహరించే పరిస్థితి ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఎన్నికల కమిషన్ సమావేశాలు సక్రమంగా జరగకపోవడం, సర్?ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సర్ ప్రక్రియను నిలిపివేసి, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకమైన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ద్వారానే ప్రజలు తమ హక్కులను కాపాడుకోగలుగుతారని, ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య హక్కులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పౌరుల హక్కులను కాపాడేందుకు తెలంగాణ జన సమితి పోరాటాన్ని కొనసాగిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా. అద్దంకి దయాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

### వీబి రాంజీ గ్రామ సభలలో కూలీలకు పిలుపు

ఇందల్వాయి , బతుకమ్మ : దేశంలోని విబి రాంజీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు గ్రామీణ ఉపాధి హామీ (విబి రాంజీ) పథకంలో కూలీలుగా నమోదైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు, ఈ మేరకు ఆయన తీర్మాన్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విబి రాంజీ పథకానికి సంబంధించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు, తీర్మాన్



పల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన విబి రాంజీ పథకానికి సంబంధించిన అవగాహన సదస్సును సర్పంచ్ చింతల కిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకొని నీటి సంరక్షణ కోసం పాటుపడాలని సర్పంచ్ చింతల కిషన్ పిలుపునిచ్చారు, ప్రజలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచనలను తప్పకుండా పాటించాలన్నారు, భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఈ సందర్భంగా సూచించారు, అలాగే గంగారం తండాలోని సర్పంచ్ సంగీత దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ కోసం ఐదు నిమిషాల పాటు ప్రార్థన నిర్వహించారు, ప్రతి ఒక్కరు నీటి సంరక్షణ కోసం పాటుపడాలని సర్పంచ్ సంగీత దిలీప్ కుమార్ సూచించారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్లు ధూమ నాయక్, జరుగు రవి, వార్డ్ సభ్యులు గణేష్ నాయక్, మేకల క్రాంతి, లింగమని, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, సువార్త కరోబార్లు నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరూ గాంధీజి అడుగుజాడల్లో నడవాలి...

రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద శుక్రవారం గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్య ఉద్యమం కోసం పోరాడిన మహనీయులు గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి అని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరి చంద్రశేఖర్, డా.విశ్వనాథ్ మహాజన్, గ్రామ పెద్దలు బచ్చు రామ్ సెట్, వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ

3 అక్టోబర్ 2026 శనివారం

# దళారులు నమ్మి రైతులు మోసపోవద్దు...

### ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించాలి

ఇందల్వాయి అక్టోబర్ 2 బతుకమ్మ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టత్మంగా భావించి నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యాన్ని విక్రయించాలని రైతులనిబ ఇందల్వాయి సింగిల్ విండో చైర్మన్ చింతలపల్లి గోవర్దన్ రెడ్డి సూచించారు, ఈ మేరకు శుక్రవారం ఇందల్వాయి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తో సహా వైస్ చైర్మన్ మారుతి నాయక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచనల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు, రైతులు అధిక ధరలకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని సూచించారు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర లభిస్తుందని వెల్లడించారు, సన్న రకం వడ్లకు సైతం బోనస్ అందించడం కేవలం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే అందజేయడం జరుగుతుందన్నారు, రైతులు ప్రతి ఒక్కరు ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇందల్వాయి సింగిల్ విండో చైర్మన్



చింతలపల్లి గోవర్దన్ రెడ్డి సూచించారు, గ్రేడ్ వన్ సన్న రకానికి 2461 రూపాయలను చెల్లించడం జరుగుతుందని వివరించారు, గ్రేడ్ 2 రకానికి 2441 రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని వివరించారు, ఈ కార్యక్రమంలో ఇందల్వాయి సింగిల్ విండో చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ మారుతి నాయక్, డైరెక్టర్లు లోకని గంగవని, నామాల గంగాధర్, మల్లారెడ్డి, గంగారెడ్డి, రామ్ రెడ్డి, సర్పంచ్ గంగవాని గంగారం, మాజీ ఎంపీటీసీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

బిచ్కుంద,బతుకమ్మ:కామారెడ్డి జిల్లా బిచ్కుంద గోల్డ్ షాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశ 2వ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గోల్డ్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవులే దయానంద్ మాట్లాడుతూ.. శాస్త్రి జీవితం, దేశానికి చేసిన సేవలను వివరించారు. "నిరాడంబరతకు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం శాస్త్రి": – ఆవులే దయానంద్



"1904 అక్టోబర్ 2న జన్మించిన లాల్ బహదూర్ శాస్త్రి, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, దేశానికి రెండవ ప్రధానమంత్రిగా సేవలందించారు. 1965లో పాకిస్తాన్ తో యుద్ధం వచ్చినప్పుడు దేశాన్ని సమర్థవంతంగా నడిపించి, 'జై జవాన్, జై కిసాన్' అనే మహత్తర నినాదాన్ని ఇచ్చారు. దేశంలో ఆహార కొరత ఉన్న సమయంలో హరిత విప్లవానికి, శ్వేత విప్లవానికి పునాది వేశారు. రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఒక రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసి, రాజకీయాల్లో నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. కేవలం 18 నెలల పాలనలోనే దేశ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మహనీయుడు శాస్త్రి. ఆయన ఆదర్శాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గోల్డ్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు దాన్యం అమ్ముకోవాలి

### సర్పంచ్ లక్ష్మి రమేష్

భీమ్ గల్, బతుకమ్మ :రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లోని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను, బోనస్ ను పొందాలని దళారుల వలలో పడి మోసపోవద్దని సర్పంచ్ కుంట లక్ష్మి రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మెండోరా గ్రామం లో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ కొబ్బరికాయను కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం మన జిల్లాలో రైతులు ఒక నెల ముందుగానే వరి నాట్లు వేయడం వల్ల ఒక నెల ముందుగానే వరి కోతలు ప్రారంభమవుతాయని గమనించిన ప్రభుత్వం రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండడం కొరకు, తొందరగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం కొరకై నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.



ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ రఘు, శ్రీనివాస్, మహిళా సమాఖ్య విఓఏలు శిరీష,పుష్ప, విడిసి అధ్యక్షులు గంగాధర్, కార్యదర్శి రాజేందర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేశ్వర్ గౌడ్ , నాయకులు పల్లె శేఖర్, చాకలి గంగాధర్, మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపిటిసి ఆరే రవీందర్, వార్డు సభ్యులు సప్పాలా సత్యనారాయణ,బాజిరెడ్డి అభిలాష్, డాక్టర్ సంతోష్ రెడ్డి, బాలరాజు, పల్లె రాము, కొమిర భూమేష్, షఫీ, బాబురావు, కాంగ్రెస్ నాయకులు మెడికల్ సత్యం, పల్లికొండ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# గుంజిల్లే సూపర్ బ్రెయిన్ యోగగా ప్రాచుర్యం

### అంతర్జాతీయ గుంజిళ్ళ ప్రచారకులు అందె జీవన్ రావు

హైదరాబాద్, బతుకమ్మ :పూర్వం విద్యార్థులకు ఉపాధ్యాయులు ఇచ్చే పనిష్మెంట్ గుంజిళ్ళు (పస్కీలు) ఇప్పుడు సూపర్ బ్రెయిన్ యోగగా ప్రాచుర్యంలోకి వచ్చాయని అంతర్జాతీయ గుంజిళ్ళ ప్రచారకులు అందె జీవన్ రావు తెలిపారు. శుక్రవారం న్యూ ఢిల్లీ లోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో సంస్కృత విభాగం రజతోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహింపబడుతున్న జాతీయ సదస్సులో "సూపర్ బ్రెయిన్ యోగా – మానసిక, అభిజ్ఞా ఆరోగ్యం" అనే అంశంపై జీవన్ రావు, డాక్టర్ రఫియా హసన్ లు సంయుక్తంగా తమ పరిశోధన పత్రాన్ని సమర్పించి ప్రసంగించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో ని పాఠశాలలో గుంజీళ్లు తీయించడాన్ని శిక్షగా పరిగణించడం వలన నిషేధింపబడినాయని అన్నారు.




గుంజీళ్లు సూపర్ బ్రెయిన్ యోగా అనే ఆధునిక పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చిందని దీనిని మెదడును చురుకుదనం చేసే వ్యాయామంగా అంతర్జాతీయంగా సాధన చేస్తున్నారన్నారు. సూపర్ బ్రెయిన్ యోగా వలన మెదడు చురుకుదనం పెరిగి, జ్ఞాపక శక్తి మెరుగుపడుతుందని పరిశోధనల ద్వారా తేలిందన్నారు. ఆ పరిశోధనా వివరాలను సదస్సులో వారు వివరించారు . సూపర్ బ్రెయిన్ యోగా ప్రతినిత్యం చేయడం వలన విద్యార్థులలో జ్ఞాపక శక్తి, అభ్యసనం, సృజనాత్మకత, జ్ఞానం, ఏకాగ్రత, గుర్తుంచుకోవడం, సమస్యా పరిష్కారం, వ్యాధి నిరోధక శక్తి మొదలైనవి పెంపొంది, సమస్యలు, ఆందోళనల నుండి ఉపశమనం కలుగుతుందని అన్నారు. కావునా మన దేశంలో కూడా గుంజీళ్లు శిక్షగా కాకుండా వ్యాయామంగా పరిగణించి పాఠశాలలో ప్రార్ధనా సమయంలో విద్యార్థులచే 14 రౌండ్లు సూపర్ బ్రెయిన్ యోగా చేయించాలాన్నారు. తద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి గుంజిళ్ళు దోహదపడతాయాన్నారు. పరిశోధకులు అడిగిన సందేహాలకు అందె జీవన్ రావు సమాధానాలతో నివృత్తి చేసినారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మెండోరా బతుకమ్మలిమెండోరా మండలంలోని పోచంపాడ్ గ్రామ శివారులో గోదావరి నది తీరాన స్మశాన వాటిక సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లబ్దమైనట్లు ఎస్సై సువాసిని తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 60 ఏళ్లు ఉంటాయన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు వెంటనే మెండోరా పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించి సహకరించాలని ఆమె కోరారు.

## ఘనంగా జరుపుకున్న గాంధీ జయంతి వేడుకలు



ఏర్గట్ల ,బతుకమ్మ:మండలం తడపాకల్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు ఘన నివాళులర్పించి ఈ సందర్భంగా గాంధీజీ అహింస, సత్యాగ్రహం, స్వచ్ఛత సందేశాలను స్మరించుకోవడం జరిగింది.గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ఐక్యత అవసరమని సర్పంచ్ జె. స్వప్న అనిల్ కుమార్ అన్నారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ లోలపు రాజు, కార్యదర్శి రాకేష్, కరోబార్ హన్మండ్లు, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, నాయకులు అంబటి రాజేశ్వర్, మట్టెల వెంకట్, జబ్బర్ హాజరయ్యారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు.

## రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

### సర్పంచ్ విజయ్ కుమార్



మోర్తాడ్ బతుకమ్మ:ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని లాభాలు పొంది రైతులు అధికంగా అభివృద్ధి చెందాలని సర్పంచ్ విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శెట్ పల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలకు లోబడి శుభ్రపరిచి బాగా ఆరపెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయిరాం ఏ యం సీ డైరెక్టర్ లక్మ రంజిత్,మండల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బక్కూరి ఆనంద్, పాలెం రాము, సహకార సంఘం కార్యదర్శి రఘు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక వక్స్ బోర్డ్ చైర్మన్ ను కలిసిన టిఆర్ఎస్ నాయకులు మతిన్...

రుద్రూర్, బతుకమ్మ : ఆల్ ఇండియా ముస్లింల బోర్డు మెంబర్, కర్ణాటక వక్స్ బోర్డు చైర్మన్ హజ్రత్ అలీ హుస్సేన్ ను టీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజవర్గ నాయకులు కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలో మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం లోని ముస్లిం మైనార్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనతో చర్చించినట్లు మతిన్ తెలియజేశారు. మతిన్ తో పాటు ఆవద్ బిన్ అబ్దుల్లా, ఖుద్దుస్, సోను, సమీర్ ఉన్నారు.



# కూలీలు అవసరమయ్యే పనులకే ప్రాధాన్యతనివ్వాలి

## ఎంపీడీఓ సంతోష్ కుమార్



భీమ్ గల్, బతుకమ్మ :విభిజీరాం పథకం కింద గుర్తినుంచనున్న పనులను కూలీలు అవసరమయ్యే పనులకు ప్రాధాన్యతనిచ్చి గుర్తించాలని ఎంపీడీఓ సంతోష్ కుమార్ సూచించారు.మండలంలోని పల్లికొండ, లింగాపూర్ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలకు ఎంపీడీఓ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక గ్రామసభలలో వీబిజి రాం పథకము వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలలో భాగంగా గుర్తించిన పనులను ఆమోదం తీసుకోవాలని, ఆమోదం తీసుకున్న పనులను పరిపాలన ఆమోదం కొరకు మండల కార్యాలయానికి పంపాలన్నారు. అక్టోబర్ 2 తారీకు నుండి డిసెంబర్ 30 వ వరకు మూడు సంవత్సరాల కు సంబంధించిన ప్రణాళికలు తయారు చేసుకొని వాటిని తదుపరి గ్రామసభలలో ఆమోదం తీసుకోవాలన్నారు.ఈ పథకంలో 375 రకాల పనులు ఉన్నాయని వాటిలో నీటి భద్రత పనులు, గ్రామీణ మౌలిక సదుపాయాలు, గ్రామీణ జీవనోపాదుల అభివృద్ధి పనులు, వరద నివారణ పనులు ఉన్నాయన్నారు. వాటిని అవగాహన చేసుకుని గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ముఖ్యంగా కూలీలకు అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మెటీరియల్ కాంపోనెంట్ వస్తుంది కావున ఎక్కువ మొత్తంలో కూలీలను సమీకరించి పనులు జరిగే విధంగా చూడాలన్నారు.కొత్తగా జాబ్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్న కూలీలకు కొత్త జాబ్ కార్డులను ఎంపీడీఓ పంపిణీ చేశారు. లింగాపూర్ గ్రామంలో కమ్యూనిటీ ఇంకుడు గుంత పనులను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జీ నర్సయ్య, సంబంధిత గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, పాలకవర్గము, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థాయి అధికారులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి , విబిజీరాం జీ కూలీలు పాల్గొన్నారు.

## మనుషులు మాట్లాడే పదాల లయను సైతం పసిగడుతున్న శునకాలు.. అధ్యయనంలో వెల్లడి..

మనుషులు మాట్లాడే నిరంతర సంభాషణలోని పదాలను కుక్కల మెదడు కూడా ఒక స్థాయిలో గుర్తించి వేరు చేస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. బుడాపెస్ట్‌లోని ఎట్వోష్ లోరాండ్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయనం సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. మనుషుల మాదిరిగానే కుక్కల మెదడు కూడా పదాల లయను గుర్తించి దానికి అనుగుణంగా స్పందిస్తుందని పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా పదాల్లోని హల్లులు వాటి నిర్మాణానికి ఆధారంగా ఉన్నప్పుడు కుక్కల మెదడులో ఈ సమన్వయం మరింత స్పష్టంగా కనిపించింది. మనుషుల్లో గతంలో గుర్తించిన ఈ తరహా హల్లుల ఆధారిత ప్రాధాన్యత ఇతర జంతు జాతిలోనూ కనిపించడం ఇదే తొలిసారని పరిశోధకులు తెలిపారు.

### 20 మంది మనుషులు, 20 కుక్కలతో అధ్యయనం..

ఈ పరిశోధనలో 20 మంది మనుషులు, 20 పెంపుడు కుక్కలను భాగస్వామ్యం చేశారు. వీరికి నిరంతరంగా, పదాలుగా విడదీయకుండా రూపొందించిన మాటల ధ్వని ప్రవాహాలను వినిపించారు. కొన్ని ధ్వని ప్రవాహాల్లో హల్లులు, మరికొన్నింటిలో అచ్చులు మూడు అక్షరాల నమూనాలుగా పదేపదే వచ్చేలా రూపొందించారు. మరో ధ్వని ప్రవాహంలో ఎలాంటి పునరావృత నమూనాలు లేకుండా ఉంచారు. ఎలాంటి శస్త్రచికిత్స అవసరం లేని ఈఈజీ పరీక్ష ద్వారా మెదడు కార్యకలాపాలను నమోదు చేశారు. హల్లులు పదాల నిర్మాణానికి ఆధారంగా ఉన్నప్పుడు కుక్కల మెదడు ఇతర ధ్వని ప్రవాహాలతో పోలిస్తే పదాల లయతో మరింత బలంగా సమకాలీకరించినట్లు పరిశోధకులు గుర్తించారు. మనుషుల్లోనూ ఇదే విధమైన స్పందన కనిపించింది.

### 400 మిల్లీ సెకన్ల తరువాత మార్పు..

ప్రతి పదం ప్రారంభమైన సుమారు 400 మిల్లీసెకన్ల తర్వాత కుక్కల మెదడు కార్యకలాపాల్లో మార్పు కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ మార్పు హల్లుల ఆధారంగా పదాలు నిర్మితమైనప్పుడు మాత్రమే స్పష్టంగా కనిపించింది. నిరంతరంగా వినిపించే మాటల ప్రవాహాన్ని విడివిడిగా పదాలుగా గుర్తించే ప్రక్రియకు ఈ సమయం సంబంధం కలిగి ఉంటుందని పరిశోధకులు తెలిపారు. ఆసక్తికరంగా, చిన్న వయసులో మాటలు ఎక్కువగా వినని కుక్కల్లోనూ ఇదే హల్లుల ప్రాధాన్యత కనిపించింది. జీవితంలోని తొలి మూడు నెలలు వీధిలో లేదా ఆశ్రయ కేంద్రాల్లో గడిపిన కుక్కల్లో కూడా ఇలాంటి స్పందన కనిపించడం వల్ల ఇది ప్రత్యేకమైన ప్రారంభ భాషా శిక్షణ వల్ల మాత్రమే ఏర్పడాల్సిన అవసరం లేదని పరిశోధకులు భావిస్తున్నారు. సాధారణ నమూనాలను నేర్చుకోవడం ద్వారా కూడా ఈ నాడీ సంబంధిత ప్రాధాన్యత అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు.

### మనుషులు, కుక్కల మధ్య స్పష్టంగా తేడాలు..

అయితే మనుషులు, కుక్కల మధ్య కొన్ని ముఖ్యమైన తేడాలను కూడా అధ్యయనం వెల్లడించింది. అచ్చుల ఆధారంగా రూపొందించిన పదాలను మనుషులు గుర్తించగలిగినప్పటికీ, హల్లుల ఆధారంగా రూపొందించిన పదాలతో పోలిస్తే ఈ సామర్థ్యం తక్కువగా ఉంది. కుక్కలు మాత్రం అచ్చుల ఆధారంగా రూపొందించిన పదాలను గుర్తించలేకపోయాయి. రెండు జాతుల మెదళ్లూ అక్షరాల లయను ప్రాసెస్ చేసినప్పటికీ, వ్యక్తిగత మాట ధ్వనుల లయతో సమకాలీకరణ మాత్రం మనుషుల మెదడులోనే కనిపించింది. దీంతో మనుషులు మాటలను మరింత సూక్ష్మ స్థాయిలో, వ్యక్తిగత ధ్వనులను ప్రత్యేక ప్రక్రియలుగా పరిగణిస్తూ ప్రాసెస్ చేస్తుండగా, కుక్కలు అక్షరాలను తమ కనిష్ఠ ధ్వని యూనిట్లుగా ప్రాసెస్ చేస్తున్నట్లు పరిశోధకులు సూచించారు. మాటలను ప్రాసెస్ చేసే ఈ విధానానికి మనుషుల మాదిరిగా ముందుగానే ప్రత్యేకంగా ఏర్పడిన మెదడు నిర్మాణం లేదా భాషా సామర్థ్యాలు తప్పనిసరి కావని, క్రమం తప్పకుండా మాటలు వినడం వంటి సాధారణ అనుభవాలు కూడా మెదడు పనిచేసే విధానాన్ని ప్రభావితం చేస్తాయని ఈ అధ్యయనం సూచిస్తోంది.

## భీమగల్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు





భీమ్ గల్, బతుకమ్మ :జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో వేర్వేరుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు 'మల్లెల.లక్ష్మణ్', ఆర్యవైశ్య సంఘం, మహిళా ఆర్యవైశ్య సంఘ సభ్యులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత,సామాజిక సేవా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళా సంఘ సభ్యులు పులిహోరను పంపిణి చేశారు.దేశ స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ చేసిన సేవలను, ఆయన ఆశయాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సమాజంలో శాంతి, ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళాఆర్యవైశ్య సంఘ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, మైనార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పురానిపేట్ 4డ5వ వర్డ్ - మెంబర్ డైడి.సురేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## కుక్క కరిచినా, గోళ్లతో గాయం చేసినా ఎంతో ప్రమాదకరం.. వెంటనే చికిత్స తీసుకోవాలి.. ఎందుకంటే..

కుక్క కాటు లేదా గోళ్లతో చేసిన గాయం చిన్నదిగా కనిపించినా, రేబిస్ ప్రమాదం ఉన్నప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. రేబిస్ అనేది కేంద్ర నాడీ వ్యవస్థపై ప్రభావం చూపించే వైరస్ వ్యాధి. ఒకసారి వ్యాధి లక్షణాలు కనిపించడం ప్రా రంభమైన తర్వాత ఇది దాదాపు ప్రాణాంతకంగా మారుతుంది. అయితే జంతువు కరిచిన వెంటనే సరైన ప్రథమ చికిత్స, అవసరమైన రేబిస్ టీకా, ఇతర చికిత్సలు తీసుకుంటే ఈ వ్యాధిని నివారించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా మానవుల్లో వచ్చే రేబిస్ కేసుల్లో దాదాపు 99 శాతం కుక్కల వల్లే వస్తున్నాయి. భారత్‌లో ప్రతి ఏడాది సుమారు 91 లక్షల జంతు కాటు ఘటనలు జరుగుతుండగా, వాటిలో మూడు వంతులకు పైగా కుక్కల వల్లే సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాలు చెబుతున్నాయి. అందుకే కుక్క కాటు లేదా అనుమానాస్పదంగా దాడి చేసిన వెంటనే చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం.

**ప్రథమ చికిత్స చేయాలి..**

కుక్క కరిచిన వెంటనే ముందుగా గాయాన్ని కనీసం 15 నిమిషాల పాటు సబ్బు, ప్రవహించే నీటితో శుభ్రంగా కడగాలి. గాయాన్ని కేవలం తుడవడం లేదా కొద్దిసేపు నీటితో కడగడం సరిపోదు. ఇలా కడగడం వల్ల గాయంపై ఉన్న లాలాజలం, వైరస్ పరిమాణాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అందుబాటులో ఉంటే కడిగిన తర్వాత అయోడిన్ కలిగిన లేదా వైరస్‌ను నిర్వీర్యం చేసే ద్రావణాన్ని ఉపయోగించవచ్చు. అయితే గాయంపై కారం పొడి, మొక్కల రసాలు, ఆమ్లాలు, క్షారాలు లేదా ఇతర హానికరమైన పదార్థాలను రాయకూడదు. ఇవి రేబిస్‌ను నివారించకపోగా కణజాలానికి మరింత నష్టం కలిగిస్తాయి. గాయం చిన్నదిగా ఉన్నా వెంటనే ఆరోగ్య కేంద్రానికి లేదా యాంటీ రేబిస్ క్లినిక్‌కు వెళ్లి వైద్యుల సలహా తీసుకోవాలి.

**ఇలా జరిగితే ఇంకా జాగ్రత్త అవసరం..**

ప్రతి కుక్కను తాకిన సందర్భంలో రేబిస్ టీకా అవసరం ఉండదు. జంతువును తాకడం, ఆహారం పెట్టడం లేదా చెక్కుచెదరని చర్మంపై జంతువు నాకడం వంటి వాటిని సాధారణంగా రేబిస్ ప్రమాదంగా పరిగణించరు. చర్మంపై స్వల్పంగా చేసిన గాయాలు లేదా రక్తస్రావం లేకుండా చర్మం దెబ్బతిన్న సందర్భాల్లో గాయాన్ని కడిగి వెంటనే రేబిస్ టీకా తీసుకోవాల్సి ఉంటుంది. చర్మాన్ని చీల్చేలా కాటు లేదా గోళ్ల గాయం ఉండడం, గాయపడిన చర్మం లేదా కళ్లు, నోటి వంటి శ్లేష్మ పొరలపై జంతువు లాలాజలం పడడం వంటి తీవ్రమైన పరిస్థితుల్లో గాయాన్ని శుభ్రం చేయడంతోపాటు వెంటనే రేబిస్ టీకా, అవసరమైన సందర్భాల్లో రేబిస్ ఇమ్యూనోగ్లోబులిన్ తీసుకోవాలి. ఇంతకుముందు రేబిస్ టీకా పూర్తి కోర్సు తీసుకున్నవారికి సాధారణంగా ఇమ్యూనోగ్లోబులిన్ అవసరం ఉండదు. టీకా ఎన్ని డోసులు, ఏ రోజుల్లో తీసుకోవాలనేది గతంలో టీకా తీసుకున్నారా లేదా, గాయం తీవ్రత, టీకా ఇచ్చే విధానం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వైద్యులు సూచించిన షెడ్యూల్‌నే పాటించాలి.

**కణజాలాలకు నష్టం కలిగే అవకాశం..**

కుక్క ఆరోగ్యంగా కనిపించినా ప్రమాదం లేదని భావించకూడదు. కరిచిన కుక్క అందుబాటులో



ఉంటే, సంబంధిత అధికారుల పర్యవేక్షణలో 10 రోజుల పాటు దాన్ని పరిశీలించవచ్చు. అయితే కుక్కను గమనించే ప్రక్రియ కోసం రేబిస్ నివారణ చికిత్సను ఆలస్యం చేయకూడదు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పిల్లలు, వృద్ధులు వంటి వారికి కూడా అవసరమైనప్పుడు రేబిస్ నివారణ చికిత్స ఇవ్వవచ్చు. కుక్క కాటు వల్ల రేబిస్‌తోపాటు బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు, కండరాలు, నరాలు లేదా ఇతర కణజాలాలకు నష్టం కలుగుతుంది. అందువల్ల టెటనస్ టీకా, యాంటీబయాటిక్స్ లేదా గాయానికి కుట్లు అవసరమా అనేది కూడా వైద్యులు నిర్ణయిస్తారు. ముఖ్యంగా రేబిస్ లక్షణాలు కనిపించే వరకు వేచి ఉండకూడదు. కుక్క కాటు లేదా గోళ్ల గాయం జరిగిన వెంటనే కనీసం 15 నిమిషాలు సబ్బు, నీటితో కడిగి, ఇంటి చిట్కాలను నివారించి, వీలైనంత త్వరగా వైద్య సహాయం తీసుకోవడమే రేబిస్ నుంచి రక్షించుకునే కీలకమైన మార్గమని నిపుణులు తెలియజేస్తున్నారు.